
సాక్షి
యాదాద్రి భువనగిరి

మంగళవారం । 24 । జూన్ । 2025



సమష్టి కృషితోనే లాభాల బాట
సమష్టి కృషితోనే డీసీసీబీ లాభాల బాటలో పయనిస్తోందని బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో



అనుసంధానంతో ఆర్థికభారం
ఇచ్చంపల్లి–సాగర్ అనుసంధానంతో ఆర్థిక భారం తప్పదని తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం పేర్కొంటోంది. - 8లో



హెచ్‌ఎండీఏ నిధులతో అభివృద్ధి..
హెచ్‌ఎండీఏ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు రైతులతో ముఖాముఖి

భువనగిరిటౌన్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి సమావేశం కానున్నారని కలెక్టర్ హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుభరోసా డబ్బులు నేటితో రాష్ట్రవ్యాప్తంగా రైతులందరి ఖాతాల్లో జమకానున్నాయని, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రైతులతో సీఎం ముఖాముఖి అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించేందుకు రైతువేదికల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి రైతువేదికకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించినట్లు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,27,544 మంది రైతుల ఖాతాల్లో రూ.288,97,96,361 జమ అయినట్లు కలెక్టర్ తెలిపారు.

రైతుల ఖాతాల్లో రూ.288.97 కోట్లు జమ

సాక్షి యాదాద్రి : వానాకాలం సీజన్‌కు గాను అర్హులైన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. జిల్లాలో 2,27,544మంది రైతులకు గాను సోమవారం వరకు 2,23,525 మంది ఖాతాల్లో రూ.288.97 కోట్లు జమ అయ్యాయి. మిగిలిన వారికి మంగళవారం జమకానున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

భువనగిరిటౌన్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వన మహోత్సవం, భూ భారతి, ఆయిల్‌పామ్ సాగు, సీజనల్ వ్యాధులపై కలెక్టర్ హనుమంతరావు ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ఆయిల్‌పామ్ సాగువల్ల ప్రయోజనాలు, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలన్నారు.భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం పూర్తి చేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శివుడికి విశేష పూజలు



శివాలయం ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి అనుబంధ క్షేత్రమైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సంప్రదాయ పూజలు చేపట్టారు. సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు కనుల పండువగా నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించి, ఆ తరువాత స్వామి, అమ్మవారికి కల్యాణం జరిపించారు. సాయంత్రం ఆలయంలో వెండి జోడు సేవను ఊరేగించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్స్ పత్రాలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

యాదగిరిగుట్ట: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను సోమవారం యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల లైసెన్స్‌కు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. స్కూల్ బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, డ్రైవర్లు లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సురెన్స్‌తో పాటు ఖాకీ కలర్ చొక్కా ధరించాలని ట్రాఫిక్ సీఐ కృష్ణ సూచించారు. విద్యార్థులు బస్సు ఎక్కే సమయంలో, దిగే సమయాల్లో జాగ్రతలు తీసుకోవాలపి స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థిని ఇంటి నుంచి క్షేమంగా తీసుకెళ్లి తిరిగి ఇంటికి చేర్చే బాధ్యత డ్రైవర్లదేనన్నారు. కుటుంబసభ్యుల్లా భావించి విద్యార్థులతో మెదులుకోవాలన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు దేవేందర్, రాజు, కానిస్టేబుల్స్ శ్రీధర్‌రెడ్డి, హనుమంతు, కాశీం, నరేష్, భిక్షపతి పాల్గొన్నారు.



భువనగిరిలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్‌లో అదనపు కలెక్టర్, ఉద్యోగులు

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

భువనగిరి : జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ వీరారెడ్డి.. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జెండా ఊపి ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, ఆటల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను వెలికితీసేందుకు ఏటా ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం సీఎం కప్–2024 క్రీడా పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు, అధికారులు, సిబ్బంది జానకిరాములు, మురళీ, రేణుక, జయ, శ్రీను, నాగవర్ధన్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షెడ్లలోనే చెత్త ట్రాక్టర్లు!

ఇంధనం లేక కదలని బండ్లు
- ఇంటింటి చెత్త సేకరణకు ఆటంకం
- మేజర్ పంచాయతీల్లోనే వారంలో ఒకటి, రెండు దఫాలు సేకరణ
- చిన్న పంచాయతీల్లో పూర్తిగా బంద్
- పది రోజులుగా పల్లెల్లో దుర్గంధం

ఆత్మకూర్(ఎం), యాదగిరిగుట్ట రూరల్: పల్లెల్లో చెత్త సేకరణ నత్తనడకన సాగుతోంది. నిరంతరం కొనసాగాల్సిన ఈ ప్రక్రియ.. వారంలో ఒకటి, రెండు దఫాలే జరుగుతోంది. ట్రాక్టర్లలో డీజిల్ లేకపోవడమే ఇందుకు కారణం. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వాలనుంచి నిధులు నిలిచి పంచాయతీల నిర్వహణ కష్టంగా మారింది. మొన్నటి వరకు అప్పు చేసి పనులు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు.. ఆర్థికభారం భరించలేక ట్రాక్టర్ల నిర్వహణ చూడలేమంటూ మండల పరిషత్ కార్యాలయాల్లో తాళం చేతులు అప్పగించారు. నాటినుంచి డీజిల్ లేక ట్రాక్టర్లు షెడ్లకే పరిమితం అయ్యాయి. మేజర్ గ్రామ పంచాయతీల్లో మాత్రం వారంలో ఒకటి, రెండుసార్లు కార్యదర్శులు సొంత ఖర్చులతో ట్రాక్టర్లకు డీజిల్ పోయించి చెత్త సేకరిస్తున్నారు.



ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో పది రోజులుగా షెడ్డుకే పరిమితమైన ట్రాక్టర్

నిధులు నిల్

పల్లెల్లో చెత్త సేకరణ, మొక్కలకు నీరు పోసేందుకు గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున ట్రాక్టర్, ట్యాంకర్ మంజూరు చేసింది. అందులో భాగంగా యాదాద్రి జిల్లాలోని 421 పంచాయతీలు ప్రభుత్వ నిధులతో ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. మేజర్ పంచాయతీల్లో ప్రతి రోజూ, చిన్న గ్రామ పంచాయతీల్లో రెండు రోజులకు ఒకసారి తప్పనిసరిగా చెత్త సేకరించాల్సి ఉంటుంది. పెద్ద పంచాయతీలో డీజిల్ ఖర్చు నెలకు రూ.10వేలు వరకు, చిన్న గ్రామ పంచాయతీలో రూ.5 వేలు చొప్పున ఖర్చు వస్తుంది. అయితే పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల కాలపరిమితి ముగియడంతో 15 నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది.

భారమంతా కార్యదర్శులపైనే..

నాటినుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు ఆగిపోవడం, ప్రత్యేకాధికారులు అటువైపు కూడా చూడకపోవడంతో పంచాయతీల నిర్వహణ కార్యదర్శులు చూడాల్సి వస్తుంది. ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు ఇంతకాలం సొంతఖర్చులతో సమస్యలు పరిష్కరిస్తూ వచ్చారు. ముఖ్యంగా ట్రాక్టర్ల నిర్వహణ భారం తడిసిమోపడయ్యేది. కానీ, ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడం, ఆర్థిక భారం భరించలేక పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ పిలుపుమేరకు ట్రాకర్ల నిర్వహణ చూడలేమంటూ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయాల్లో తాళం చేతులు అప్పగించారు.



మహబూబ్‌పేటలో డంపింగ్ యార్డు ఉన్నా గ్రామ శివారులోనే చెత్త పడేసి తగలపెట్టిన దృశ్యం

పారిశుద్ధ్య సమస్య



ఆత్మకూరు(ఎం)లో రెండుమూడు రోజులకు ఒకసారి చెత్త సేకరణకు వస్తున్న ట్రాక్టర్

గ్రామ పంచాయతీల్లో దుర్గంధం నెలకొంది. క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగకపోవడం, మరోవైపు వానాకాలం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారంలో ఒకటి, రెండు దఫాలు.. అది కూడా ట్రాక్టర్‌లో డీజిల్ ఉంటేనే చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఊరిబయటకే చెత్త తరలించి దగ్ధం చేస్తున్నారు. కొందరు తమ ఇళ్లలోని చెత్తను స్వయంగా బైక్‌లపై తీసుకెళ్లి డంపింగ్ యార్డులో వేస్తున్నారు.

డీజిల్ ఉంటేనే తిప్పుతున్నారు



ఇటీవల కాలంలో చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరగడం లేదు. డీజిల్ ఉంటేనే ట్రాక్టర్‌ను తిప్పుతున్నారు. లేనిపక్షంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిలిపి ఉంచుతారు. మా ఇంట్లో చెత్తను స్వయంగా ఊరిబయట పారబోసి వస్తాం. వానాకాలం కావడంతో చెత్త పేరుకుపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–యాట లక్ష్మి, తుక్కాపురం

రూ.3 లక్షలు రావాలి



సింగారం, మొరిపిరాల గ్రామాలకు కార్యదర్శిగా పనిచేశాను. ప్రస్తుతం ఆత్మకూరు(ఎం) కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నా. మండలంలో ఆత్మకూరు(ఎం) మేజర్ పంచాయతీ. ప్రభుత్వంనుంచి నిధులు రాకున్నా పారిశుద్ధ్య సమస్య రావొద్దని అప్పుతెచ్చి ట్రాక్టర్‌లో డీజిల్ పోయించి చెత్త సేకరిస్తున్నాం. రూ.3 లక్షలు రావాలి.

–అంబోజు శేఖర్, పంచాయతీ కార్యదర్శి, ఆత్మకూరు(ఎం)

రిపేర్ చేయించాలన్నా నిధుల్లేవు



ట్రాక్టర్ల డీజిల్ పోయించాలంటే భారంతో కూడుకున్న పని. నిధులేక సొంత డబ్బులతో ట్రాక్టర్ల నిర్వహణ చూస్తున్నాం. రిపేర్‌లు వచ్చినా కార్యదర్శులే చేయించాలి. ఇప్పటికే ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడం, పంచాయతీలకు సరైన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చెత్త సేకరణ ట్రాక్టర్లు మరింత భారం అయ్యాయి.

–ఆరె రాజు, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు

వినతులు.. వేడుకోలు



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు, అధికారులు

- ప్రజావాణికి తరలివచ్చిన జనం
- వివిధ సమస్యలపై సుమారు వంద అర్జీలు
- వినతులు స్వీకరించి, పరిష్కారానికి భరోసా ఇచ్చిన కలెక్టర్

భువనగిరిటౌన్ : కలెక్టరేట్ కార్యాలయం సోమవారం జనంతో కిక్కిరిసింది. తమ సమస్యలు విన్నవించుకోవడానికి జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చారు. సామూహికంగా, వ్యక్తిగతంగా అర్జీలు అందజేయడంతో పాటు తమ బాధలను నేరుగా అధికారులకు విన్నవించారు. భూమి కబ్జా చేశారని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పింఛన్ వస్తలేదని, సదరం క్యాంపులో అర్హులకు సర్టిఫికెట్లు అందడం లేదని.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో సమస్య ఏకరువు పెట్టారు.

- ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ నాయకులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో కనీస వసతులు లేకపోయినా వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.
- రైతుభరోసా రాలేదని భువనగిరి మండలంలోని గౌస్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు మాజీ సర్పంచ్ ఈర్ల కృష్ణ అధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చారు.కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి తమ సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.
- భువనగిరిలోని ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపులో నిర్ధారణ పరీక్షలు నిర్వహించకుండానే డబ్బులు తీసుకుని సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఆరోపిస్తూ వికలాంగుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. వికలత్వం ఎక్కువ ఉన్నవారికి తక్కువ శాతం వేసి సర్టిఫికెట్‌లు ఇస్తున్నారని, దీంతో అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు.

అర్జీల వెల్లువ

ప్రజావాణి కార్యక్రమానికి అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లాల నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి వినతులు అందజేశారు. వివిధ సమస్యలపై వంద వరకు అర్జీలు వచ్చాయి. అందులో అత్యధికంగా భూ సమస్యలకు సంబంధించి 54,జిల్లా గ్రామీణాభివృద్ధి 6, పంచాయతీ రాజ్ 5, సర్వే లాండ్స్ 4, జిల్లా పరిషత్ 4, మున్సిపాలిటీ 2, జిల్లా వైద్యారోగ్య 2, విద్యుత్, అటవీ, రోడ్లు, భవనాలు, ఎంప్లాయిమెంట్, సంక్షేమ శాఖలకు సంబంధించి ఒక్కొకటి చొప్పున అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి తదితర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ హనుమంతరావు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు.

భూమి కబ్జా చేశారు

ఇక్కడ కనిపిస్తున్న రైతులది సంస్థాన్‌నారాయణపురం మండలం అల్లాపురం గ్రామం. గ్రామంలోని సర్వే నంబర్ 85లో గల పది ఎకరాల ప్రభుత్వ భూమిలో గత కొన్నేళ్లుగా నివాసం ఏర్పరుచుకొని ఉంటున్నారు. కొందరు వ్యక్తులు పక్క భూముల రైతుల సహకారంతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని, గుడిసెలు తొలగించి తమను వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ భూమి రాచకొండ రెవెన్యూ పరిధిలో ఉందని, దీనిపై గతంలో తహసీల్దార్‌కు అర్జీ పెట్టినా స్పందించలేదన్నారు. నిరుపేదలమైన తమకు న్యాయం చేయాలని కోరారు.





రైతుభరోసా డబ్బులు రాలేదని ఫిర్యాదు చేయడానికి ప్రజావాణికి వచ్చిన గౌస్‌నగర్ రైతులు

మహిళా సంఘాల పనితీరు మెరుగునకే కరదీపిక



కరదీపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అధికారులు

భువనగిరిటౌన్ : నూతనంగా ఏర్పాటైన మహిళా సంఘాల నిర్వహణ, సంఘాల లీడర్ల శక్తివంతీకరణకు దోహదపడే ఉద్దేశంతో ప్రత్యేకంగా రూపొందించిన అక్షరాస్యత సమాచార కరదీపికను సోమవారం కలెక్టర్ హనుమంతరావు ఆవిష్కరించారు. మహిళలు శక్తివంతులు కావడం వల్ల దేశానికి బలం చేకూరుతుందన్నారు. సంఘాల నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, ఆర్థిక నిర్వహణ, గ్రూపుల పనితీరు మెరుగుపర్చుకునేందుకు కరదీపిక దోహదపడుతుందన్నారు. కరదీపికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వీరారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, అదనపు డీఆర్‌డీఓ జంగారెడ్డి, డీపీఎంలు, స్వయం సహాయక మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ బిల్లు ఉపసంహరించుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

భువనగిరిటౌన్: పెన్షన్ చట్టంలో మార్పులు చేసి కేంద్రం నూతనంగా తీసుకువచ్చిన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బిల్లుకు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎదుట సోమవారం రిటైర్డ్ ఉద్యోగ సంఘం ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్ల హక్కులు, ప్రయోజనాలను కాలరాసేలా చట్టం ఉందన్నారు. చర్చలు జరపకుండా ఏకపక్షంగా పెన్షనర్ల చట్టసవరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపడం దుర్మార్గమన్నారు. బిల్లును ఉపసంహరించుకోని ఆదోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకల అనందం, కోశాధికారి ఈదులకంటి భీష్మారెడ్డి, సభ్యులు మలయ్య, రాములు, మల్లేశం, యాదగిరి, రామేశ్వరయ్య, చంద్రయ్య, చంద్రయ్య, వెంకటేశ్వర్‌రావు, ఎంఏ మస్తాన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

పక్కా భవనాలు, ప్రహరీలకు నిధులు

ఉపాధిహామీ పథకం కింద రూ.8.47 కోట్లు మంజూరు

- పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు
- 27 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం

రామన్నపేట: 2025–26 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉపాధిహామీ పథకం కింద జిల్లాకు రూ.8.47 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో 63 శాశ్వత నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ నిధులతో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలకు పక్కా భవనాలు, పాఠశాలలకు ప్రహరీలు నిర్మించనున్నారు.

పంచాయతీ భవనాలకు రూ.2కోట్లు..

జిల్లాలోని పది గ్రామ పంచాయతీలకు శాశ్వత భవన నిర్మాణాల కోసం రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఆలేరు మండలంలోని కందిగడ్డతండా, బొమ్మలరామారం మండలం కాజీపేట, గుండాల మండలం మాసాన్‌పల్లి, రాజాపేట మండలం కుర్రారం, తుర్కపల్లి మండలం గుజ్జవాని కుంటతండా, యాదగిరిగుట్ట మండలం రాళ్లజనగాం చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు, సంస్థాన్‌నారాయణపురం మండలం డాకుతండా, రామన్నపేట మండలం ఇస్కిళ్ల, అడ్డగూడూరు పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున కేటాయించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి తీరనున్న సమస్యలు

26 అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు రూ 3.12కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.12లక్షలు కేటాయించారు. ఆలేరు నియోజకవర్గంలోని తూర్పుగూడెం, పటేల్‌గూడెం, రాయిపల్లి, ఉప్పలపహాడ్, బొమ్మలరామారం(2), నూనెగూడెం, అనంతగూడెం, అమ్మనబోలు, మాటూరు, మొల్లగూడెం, చల్లూరు, ముల్కలపల్లి, ధర్మారం, సాదువెల్లి, చిన్నకందుకూరు, మునుగోడు నియోజకవర్గంలో దండుమల్కాపురం, జైకేసారం, సంస్థాన్ నారాయణపురం, జనగాం, నకిరేకల్ నియోజకవర్గంలో ఎన్నారం, సిరిపురం, తుంగతుర్తి నియోజకవర్గంలో అజీంపేట, గోవిందాపూర్, దత్తప్పగూడెం, పాలడుగు గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు నిర్మించనున్నారు. ప్రస్తుతం వీటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేకపోవడం, పైగా ఇరుకుగదులు కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భవనాలు అందుబాటులోకి వస్తే అంగన్‌వాడీ సిబ్బందికి సమస్యలు తీరనున్నాయి.



ఇది రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. మారెపల్లి మల్లారెడ్డి అనే దాత ఇచ్చిన స్థలంలో ఆర్‌ఎంఎస్‌ఏ నిధులు వెచ్చించి 2012 సంవత్సరంలో పాఠశాల ఏర్పాటు చేశారు. కానీ, ప్రహరీ నిర్మించలేదు. చుట్టూ పెరిగిన కంపచెట్లే పాఠశాలకు కంచెగా మారాయి. ప్రహరీ నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రహరీలతో పాఠశాలలకు రక్షణ

పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రక్షణ లేకుండాపోయింది. పశువులు, ఇతర మూగజీవాలు వస్తున్నాయి. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఉపాధిహామీ పథకం కింద 27 పాఠశాలలకు రూ 3.35 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఒక యూపీఎస్, 14 ఉన్నత, 12 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.

మిగతా కేంద్రాలకూ నిధులివ్వాలి



సిరిపురంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. నాలుగు కేంద్రాలకు సొంత భవనాలు లేవు. భవనాల నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని దాతలు గ్రామ పంచాయతీకి అప్పగించారు. ఒక అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరయ్యాయి. మిగతా మూడు కేంద్రాలకు కూడా దశలవారీగా నిధులు మంజూరు చేయాలి.

–అప్పం లక్ష్మీనర్సు, తాజామాజీ సర్పంచ్, సిరిపురం

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజాపేట: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజాపేట మండలం రఘునాథపురంలో సోమవారం పవర్‌లూమ్ కార్మికులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమం కోసం త్రిప్ట్ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తుందన్నారు. కార్మికులు, అనుబంధ కార్మికులు ప్రతినెలా తమ వాటాధనం చెల్లించి మాచింగ్ గ్రాంట పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రఘునాథపురం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బింగి బాలరాజు, మాజీ సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కటుకం వెంకటేశం, పరిసర గ్రామాల పవర్‌లూమ్ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మృతి

సూర్యాపేట: జీవితంపై విరక్తితో గడ్డి మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పెన్‌పహాడ్ ఏఎస్‌ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామానికి చెందిన జాల సైదులు(29) మద్యానికి బానిసయ్యాడు. ఎటువంటి పని చేయకుండా తిరుగుతున్న సైదులు జీవితంపై విరక్తితో ఈ నెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అపస్మారకస్థితిలో ఉన్న సైదులును చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య శృతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

దేవరకొండ: నేరెడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. సోమవారం గ్రామంలోని ఓ కిరాణ దుకాణంలో సరుకులు కొనేందుకు వెళ్లిన సదరు బాలిక తిరిగి ఇంటికి చేరుకోలేదు. బాలిక కోసం తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో నేరెడుగొమ్ము పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటేష్ తెలిపారు.

పని కోసం వచ్చి..

భువనగిరి: ఎలక్ట్రికల్ పనిచేసేందుకు భువనగిరి మండలం అనాజీపురం గ్రామానికి వచ్చిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం సీతారామపురం గ్రామానికి చెందిన పోతరాజు శ్రీనివాస్‌రావుతో మరికొందరు కలిసి ఎలక్ట్రికల్ పనిచేసేందుకు ఈ నెల 13న భువనగిరి మండలం అనాజీపురం గ్రామానికి వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం శ్రీనివాస్‌రావు కిరాణ దుకాణానికి వెళ్లొస్తానని తన వెంట వచ్చిన వారితో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా శ్రీనివాస్‌రావు ఆచూకీ లభించకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

‘ఇచ్చంపల్లి-సాగర్’తో ఆర్థిక భారం

పోలవరం టు సాగర్ ప్రాజెక్టు అనుకూలం

- గోదావరి జలాలను పోలవరం నుంచి సాగర్ టెయిల్‌పాండ్‌కు తరలించవచ్చు
- ఈ ప్రాజెక్టుతో ఖర్చు కూడా తక్కువ
- తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం


నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఫైల్)


పోలవరం ప్రాజెక్టు (ఫైల్)

నాగార్జునసాగర్: గోదావరి జలాలను కృష్ణాబేసిన్‌కు మళ్లించేందుకు ఇచ్చంపల్లి–నాగార్జునసాగర్, పోలవరం–బనకచర్ల అనుసంధానం కన్నా పోలవరం నుంచి శ్రీశైలం జలాశయానికి అనుసంధానం చేసే పథకమే బాగుంటుందని తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం పేర్కొంటోంది. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి అనుసంధానం చేసే పథకానికి సుమారు 350 కిలోమీటర్లకు పైచిలుకు పొడవు కాల్వ తవ్వాల్సి ఉంటుంది. కాల్వ లైనింగ్‌లతో కలిపితే సుమారు అరకిలోమీటరు వెడల్పులో భూసేకరణ చేయాల్సి ఉంటుంది. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా ఆయకట్టుకు కేవలం ఒక టీఎంసీ నీటిని మాత్రమే తరలిస్తారు. గోదావరి నీటిని కృష్ణాబేసిన్‌కు మళ్లించే కాల్వలో రెండు టీఎంసీలకు పైచిలుకే నీటిని తరలించాలి. ఈ కాల్వ తవ్వకానికి గాను సుమారు 50వేల ఎకరాల భూసేకరణ చేయాలని ఇంజనీర్లు పేర్కొన్నారు. ఆ భూమంతా తెలంగాణలో ఇప్పటికే ఏదో ఒక ప్రాజెక్టు ద్వారానో, చెరువుల కిందనో బోరు బావుల ద్వారానో సేద్యమవుతూనే ఉంటుంది. భూసేకరణకు దాదాపు రూ.10వేల కోట్లు నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు మరో రూ.20 వేల కోట్లకు పైచిలుకే ఖర్చు కానున్నట్లు అంచనా.

తెలంగాణ డిమాండ్లను అమలు చేశాకే గోదావరి నీరు బనకచర్లకు

గోదావరి నుంచి బనకచర్లకు 200టీఎంసీల నీటిని తరలించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర జలశక్తి మంత్రి కార్యాలయానికి ప్రతిపాదనలు పంపింది. తెలంగాణ రాష్ట్ర డిమాండ్లను అమలు చేశాకే బనకచర్లకు నీటి తరలింపు పనులు మొదలు కావాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం డిమాండ్ చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలి నీటిని తరలంచాలని భావిస్తే ప్రజలలో తిరుగుబాటు వచ్చే అవకాశం లేకపోలేదు. గోదావరి ఉపనదులపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్నవి, భవిష్యత్తులో నిర్మించే ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలని డిమాండ్లలో పెట్టారు. పోలవరం నుంచి గోదావరి జలాలు 200టీఎంసీలు పెన్నా బేసిన్‌లోకి తరలించి సాగుకు వినియోగించే ప్రతిపాదన ఉన్నందున, అంతే నీటిని కృష్ణానదిలో తెలంగాణకు వాటాకు అదనంగా కేటాయించాలి. అన్ని అనుమతులు వచ్చాకే ఈ ప్రాజెక్టును చేపట్టాలి. డీపీఆర్‌ను గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) పరిశీలించి సాధ్యాసాధ్యాలను రిపోర్టు ఇచ్చిన తర్వాత సీడబ్ల్యూసీ నుంచి హైడ్రాలాజికల్ అనుమతి పొందాలి. అనంతరం అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందాలని, అప్పుడే ప్రాజెక్టు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వమే చేపట్టి రెండు తెలుగు రాష్ట్రాలకు ఆర్థిక భారాన్ని తప్పించి, త్వరగా పూర్తి చేయాలని కోరారు. దీంతో పాలమూరు–రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్‌ఎల్‌బీసీ ఉదయ సముద్రం తదితర ప్రాజెక్టుకు నికరంగా జలాల కేటాయింపులు జరుగుతాయి. ఇదే విషయాలపై తెలంగాణ రిటైర్ల ఇంజనీర్లు త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం.

పోలవరం - సాగర్ టెయిల్‌పాండ్‌తోనే తెలంగాణకు న్యాయం



పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను నాగార్జునసాగర్ టెయిల్ పాండ్‌లోకి తరలించే పథకం ద్వారనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయినందున కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తి చేయాలన్నారు. ఈ నీటి తరలిపుతో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమకు సాగునీటిని అందించడంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో కృష్ణానదిపై గల ప్రాజెక్టులకు, గోదావరి నదులపై గల ప్రాజెక్టులకు నికర జలాలు అందుతాయి. తక్కువ ఖర్చుతో ఉన్న వనరులను వినియోగించుకోని త్వరలో ప్రాజెక్టును పూర్తి చేసే అవకాశాలుంటాయి. – మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు

పోలవరంతో రోజుకు 3, 4టీఎంసీలు తరలించవచ్చు

పోలవరం ప్రాజెక్టు డైవర్షన్ ద్వారా సీజన్‌లో 100 రోజుల పాటు నీటి రాకను బట్టి 200 నుంచి 300 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్‌కు తరలించవచ్చు.అక్కడి నుంచి రివర్సబుల్ టర్బైన్ల ద్వారా నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు తక్కువ ఖర్చుతో నీటిని తరలించే అవకాశాలున్నట్లు తెలంగాణ ఇంజనీర్ల ఫోరం తెలిపింది. పోలవరం నుంచి ప్రస్తుతం కుడి కాల్వకు సమాంతరంగా మూడు నుంచి నాలుగు టీఎంసీల నీటిని మళ్లించేందుకు తాజా కాల్వను రూపొందించాలి. ఎటువంటి భూసేకరణ లేకుండానే కృష్ణానదికి 300 టీఎంసీల గోదావరి జలాలను తరలించవచ్చు. 2019లోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రెండు రాష్ట్రాల ఇంజనీర్లు, అధికారులతో కలిసి రెండు సమావేశాలు నిర్వహించారు. దక్షిణ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లోని రాయలసీమలో సాగునీటి కొరత తీర్చేందుకు గోదావరి నీటిని కృష్ణానది జలాశయాల్లోకి మళ్లించడం గురించి చర్చించారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు కేవలం రూ.25,000కోట్లు మాత్రమేనని అంచనా వేశారు.

సమష్టి కృషితోనే లాభాల బాట

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: పాలకవర్గం, సహకార సంఘాల చైర్మన్లు, ఉద్యోగుల సమష్టి కృషితోనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) లాభాల బాటలో పయనిస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని డీసీసీబీ కార్యాలయంలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.2,850.81 కోట్ల టర్నోవర్‌కు చేరుకుని రూ.42.31కోట్ల గ్రాస్ ప్రాఫిట్, రూ.26.97కోట్ల నెట్ ప్రాఫిట్‌ను సాధించిందన్నారు. రుణం పొందిన వ్యక్తులు ఏదేని కారణంతో చనిపోతే వారి కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ఓటీఎస్ విధానం అమలు చేస్తున్నామన్నారు. సహకార సంఘాలకు నాబార్డు రీ ఫైనాన్స్ ద్వారా కిసాన్ డ్రోన్‌లు అమలు చేయనున్నామన్నారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా రైతులు కోళ్లు, కోళ్ల ఫారాలు, పాడి పరిశ్రమ ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందిస్తున్నామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాల కోసం తక్కువ వడ్డీతో గరిష్ఠంగా రూ.35లక్షల వరకు రుణం ఇచ్చేలా కొత్త పాలసీ తీసుకొచ్చామన్నారు. ఇప్పటి వరకు 116మంది రైతులకు రూ.17 కోట్లు రుణాలు అందించామన్నారు. బంగారు ఆభరణాలపై రూ.623.92 కోట్ల రుణాలను అందించామన్నారు. డిపాజిట్‌ల సేకరణ లక్ష్యాన్ని త్వరలో పూర్తిచేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు గొంగిడి మహేందర్‌రెడ్డి, పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, ధనావత్ జయరామ్, అందెల లింగంయాదవ్, కోడి సుష్మ, ప్రవీణ్‌రెడ్డి, దొండపాటి అప్పిరెడ్డి, రంగాచారి, బంటు శ్రీనివాస్, కొండ సైదయ్య, రామచంద్రయ్య, సీఈఓ రావులపాటి శంకర్‌రావు పాల్గొన్నారు.

నీటి నిల్వ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కేంద్ర జలవనరుల కమిటీ అధికారి ఆనంద్‌బాబు


కొరటికల్‌లో పత్తి కుంటను పరిశీలిస్తున్న కేంద్ర జలవనరుల కమిటీ అధికారి ఆనంద్‌బాబు

మునుగోడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీటి నిల్వకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర జలవనరుల కమిటీ అధికారి ఆనంద్‌బాబు సూచించారు. సోమవారం మునుగోడు మండలంలోని కొరటికల్, గూడపూర్, సింగారం, జమస్తాన్‌పల్లి తదితర గ్రామాల్లో నీటి నిల్వ కోసం చేపట్టిన చెక్ డ్యాంలు, పత్తి, ఊట కుంటలతో పాటు వరద కట్టల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో ఎక్కడెక్కడ ఎన్ని పనులు చేశారు, వాటికి ఎంత ఖర్చయ్యింది. వాటి వల్ల భూగర్భ జలాలు ఏమైనా పెరిగియా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు అడుగంటుతున్న భూగర్భజలాలను పెంచేందుకు వర్షపు నీరు వృథా కాకుండా భూమిలో ఇంకేలా చొరవ చూపాలని సూచించారు. ఆయన వెంట మండల అభివృద్ధి అధికారి విజయభాస్కర్, ఎంపీఓ స్వరూపరాణి, ఏపీఓ నాగరాజు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

దొంగతనం కేసులో ఐదుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్: దొంగతనం కేసులో ఐదుగురు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. డీఎస్పీ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన బోడ వెంకటేష్ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లిలో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈటూరు గ్రామానికే చెందిన నంగునూరి బయ్యమ్మ కుటుంబ సభ్యులు ఉపాధి నిమిత్తం తమిళనాడు రాజధాని చెన్నైలో స్థిరపడ్డారు. బయ్యమ్మ గ్రామంలో ఒంటరిగా నివసిస్తోంది. ఆమె భూమిని బోడ వెంకటేష్ మామ యాల రమేష్ కౌలుకు చేస్తున్నాడు. దీంతో అప్పుడప్పుడు రమేష్‌తో పాటు వెంకటేష్ కూడా బయ్యమ్మ ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో బయ్యమ్మ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను కాజేయాలని వెంకటేష్ నిర్ణయించుకున్నాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి వెంకటేష్‌తో పాటు తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు పోతరాజు నాగరాజు, అడ్డగూడూరు మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల చంద్రశేఖర్, నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము సోమయ్య, వడ్డె పున్నం కలిసి కారులో హైదరాబాద్ నుంచి ఈటూరుకు వచ్చారు. బయ్యమ్మ ఒక్కతే ఇంట్లో నిద్రిస్తుండగా.. ఆమె ఇంటి వెనక నుంచి గోడ దూకి తమ వెంట తెచ్చుకున్న కట్టర్‌తో కరెంట్ కట్ చేశారు. వెంకటేష్‌ను బయ్యమ్మ గుర్తుపడుతుందని భావించి మిగతా నలుగురు వెళ్లి ఆమెను గట్టిగా పట్టుకొని చీరతో చేతులు కట్టేశారు. ఆమె మెడలోని నల్లపూసల గొలుసు, చేతి గాజులతో పాటు ఇళ్లంతా వెతికి దొరికిన డబ్బులతో అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే చోరీ చేసిన సొత్తును విక్రయించేందుకు సోమవారం నిందితులు కారులో వెళ్తుండగా.. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది తిరుమలగిరిలో వారిని పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి కారు, నల్లపూసల గొలుసు, ఐదు సెల్‌ఫోన్లు, కట్టర్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నాగారం సీఐ రఘువీర్ రెడ్డి, ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలు

శాలిగౌరారం: విద్యుత్ స్తంభంపై బోరు మోటారుకు కనెక్షన్ కలుపుతూ విద్యుదాఘాతానికి గురైన యువకుడు ప్రాణా పాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం భైరవునిబండ గ్రామంలో ఆదివారం జరగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భైరవునిబండ గ్రామానికి చెందిన ముప్పిడి నవీన్ తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ విద్యుత్ మోటారు మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన ఆవుల నరేశ్ తాను కౌలుకు తీసుకున్న వ్యవసాయ భూమి వద్ద బోరు మోటారు బిగించేందుకు ఆదివారం నవీన్ వెళ్లాడు. మోటారు బిగించిన తర్వాత విద్యుత్ స్తంభంపై కనెక్షన్ ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్ ఆఫ్ స్విచ్(ఏబీ స్విచ్) లేకపోవడంతో ఆవుల నరేశ్ సబ్ స్టేషన్‌లో భైరవునిబండ ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకునేందుకు గ్రామానికి చెందిన విద్యుత్ మోటారు మెకానిక్ ఈదుల కంటి నరేశ్‌కు ఫోన్ చేశాడు. నరేశ్ హైదరాబాద్‌లో ఉండడంతో సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నిమ్మనగోటి నాగరాజుకు ఎల్‌సీ ఇవ్వమని చెప్పడంతో అతడు ఎల్‌సీ ఇచ్చాడు. దీంతో నవీన్ విద్యుత్ స్తంభం పైకి ఎక్కి కనెక్షన్ ఇస్తున్నాడు. అదే సమయంలో ఎన్‌జీ కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ బిల్లులు కొట్టే మునీర్ ఎన్‌జీ కొత్తపల్లి ఫీడర్‌ను ఎల్‌సీ తీసుకున్నాడు. పని పూర్తికాగానే ఎన్‌జీ కొత్తపల్లి ఫీడర్ ఎల్‌సీని మునీర్ రిటర్న్ తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న నిమ్మనగోటి నాగరాజు ఎన్‌జీ కొత్తపల్లి ఫీడర్‌తో పాటు భైరవునిబండ ఫీడర్‌ను కూడా ఆన్ చేశాడు. దీంతో విద్యుత్ స్తంభంపై కనెక్షన్ ఇస్తున్న నవీన్ విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. నవీన్‌ను స్థానికులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన..

నవీన్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సోమవారం సబ్‌స్టేషన్ గేటుకు తాళం వేసి ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఏడీఈ వారితో ఫోన్‌లో మాట్లాడి అన్నివిధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దేవరకొండ: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలం ఘణపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి ఆంజనేయచారి తన ద్విచక్ర వానంపై ఆదివారం రాత్రి కొండమల్లేపల్లి నుంచి ఘణపురం గ్రామానికి వెళ్తుండగా.. పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడితో పాటు ఆంజనేయచారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి గుర్తుతెలియని వ్యక్తి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆంజనేయచారి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, అతడి ఎడమ చేతిపై చమన్ అని ఇంగ్లిష్ అక్షరాలతో పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670227 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు. చిల్కమర్రి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

దేవరకొండ: జీవితంపై విరక్తితో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామంలో జరిగింది. చింతపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన విరాల ప్రకారం.. నసర్లపల్లి గ్రామానికి చెందిన జింకల శివ(32) హైదరాబాద్‌లోని కారు డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతేడాది అతడి భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అతడికి కూడా ఆరోగ్యం బాగోలేకపోవడం, కుటుంబ సమస్యల కారణంగా మనోవేదనకు గురవుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం అటుగా వెళ్లిన గ్రామస్తులకు శివ ఉరికి వేలాడుతూ కనిపించడంతో వెంటనే అతడి బంధువులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై గొంతు కోసుకుని..

భువనగిరిటౌన్: మద్యానికి బానిసైన యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని హనుమాన్‌వాడలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌వాడకు చెందిన బి. నవీన్ (26) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్న నవీన్ సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కుమారస్వామి తెలిపారు.

మంటల్లో ద్విచక్ర వాహనం దగ్ధం

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు గోరెమియా రోజుమాదిరిగా ఆదివారం రాత్రి తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి సమయంలో బైక్‌కు మంటలు అంటుకోవడంతో గోరెమియా గమనించి ఇంటి బయటికి వచ్చి చూసేసరికి బైక్ పూర్తిగా కాలిపోయింది. గుర్తుతెలియని వ్యక్తులు తన బైక్‌కు నిప్పంటించారని బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ క్రాంతికుమార్ సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటార్ సైకిల్ అదుపుతప్పి ఉత్తరప్రదేశ్ వాసి మృతి

వలిగొండ: మోటార్ సైకిల్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాబు(28) వలిగొండకు వలస వచ్చి ఐస్‌క్రీంలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై లోతుకుంట నుంచి వలిగొండకు తిరిగొస్తుండగా.. లోతుకుంటలోని పవిత్రాత్మ స్కూల్ సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

బంగారు ఆభరణాలు అపహరణ

సూర్యాపేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారం అపహరించారు. సోమవారం పెన్‌పహాడ్ ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీకి చెందిన గుండపునేని వెంకట్రావు ఈ నెల 18న హన్మకొండలోని తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు వెంకట్రావు ఇంట్లోకి చొరబడి బీరువా పగులగొట్టి 8తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చిన వెంకట్రావు తాళాలు పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పత్తి రైతు కష్టాలు


ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన రైతు తాళ్లపల్లి నర్సయ్యగౌడ్ ఐదెకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాడు. ఇప్పటి వరకు పత్తి విత్తనాలకు, దున్నకానికి, కలుపుతీతకు, గుంటుక తోలినందుకు గాను రూ.50వేల వరకు పెట్టుబడి వచ్చింది. వర్షాలు ముఖం చాటేయడంతో మొలకెత్తిన పత్తి మొక్కలు వాడిపోయే దశకు చేరుకున్నాయి. దీంతో సోమవారం నర్సయ్యగౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి బక్కెట్లు, బిందెల సహాయంతో పత్తి మొక్కలకు నీళ్లు పోసి వాటిని కాపాడుకునే ప్రయత్నం చేశాడు. – ఆత్మకూరు(ఎం)

లక్కీ డ్రా స్కీం పేరుతో మోసం

- 2600 మంది నుంచి రూ.4కోట్లకు పైగా వసూలు
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు



ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ స్కీం బ్రోచర్లను చూపిస్తున్న బాధితులు

మిర్యాలగూడ: ‘ప్రతి నెలా రూ.1000 కట్టు.. నెల చివరలో తీసే లక్కీ డ్రాలో ప్రైజ్ కొట్టు’ అంటూ ఓ ప్రైవేట్ సంస్థ నిర్వాహకులు అమాయక ప్రజలను నిండాముంచారు. మిర్యాలగూడ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ మోసంపై బాధితులు, మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ పేరిట మిర్యాలగూడకు చెందిన కె. రమేష్, కె. కోటేశ్వర్‌రావు, బచ్చలకూరి శ్రీనివాస్ లక్కీ డ్రా స్కీం ఏర్పాటు చేశారు. వారి వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఏజెంట్లను కూడా నియమించుకున్నారు. మిర్యాలగూడతో పాటు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి, నేరేడుచర్ల , ఏపీ సరిహద్దు గ్రామాల్లోనూ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని సభ్యులను చేర్చుకున్నారు. ఈ స్కీంలో చేరిన ఒక్కో సభ్యుడి నుంచి 15నెలల పాటు ప్రతి నెలా రూ.1000 చొప్పున వసూలు చేశారు. ఇలా 2600 మందిని సభ్యులుగా చేర్చుకుని ప్రతి నెలా డ్రా తీసి 10మందికి రూ.15వేల విలువైన వస్తువులను అందజేస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ లక్కీ డ్రా స్కీం ఈ ఏడాది జనవరిలో ముగిసింది. ఇప్పటి వరకు 150మందికి డ్రా పద్ధతిలో వస్తువులు అందజేసిన నిర్వాహకులు ఆ తర్వాత స్కీంను అర్ధాంతరంగా ఎత్తివేశారు. గత ఆరునెలలుగా నిర్వాహకులు పత్తా లేకపోవడంతో స్కీంలో చేరిన సభ్యులు వారి కోసం ఆరా తీశారు. వారిని సభ్యులుగా చేర్పించిన ఏజెంట్లను నిలదీయడంతో తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఈ స్కీం పేరిట ఇప్పటివరకు 2600మంది సభ్యుల నుంచి రూ.4 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. చివరి నెల డ్రాలో కారు ఇస్తామని నిర్వాహకులు చెప్పినట్లు బాధితులు తెలిపారు. స్కీంలో చెప్పిన విధంగా చెల్లింపులు చేయకపోవడం, బంపర్ డ్రా తీయకపోవడంతో మిర్యాలగూడ పట్టణం కలల్‌వాడకు చెందిన మొరుగు వెంకటమ్మ అనే మహిళ తనను సభ్యురాలిగా చేర్పించిన మందారి మల్లేశ్వరి, స్కీం నిర్వాహకుడు కె. రమేష్‌పై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న మిగిలిన బాధితులు కూడా సోమవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఒక్క మిర్యాలగూడ పట్టణంలోనే 900 మంది బాధితులున్నట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపారు.